ప్రజాశక్తి

గురువారం 16 జనవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నీటి వనరులపై శ్రద్ధ కరువు

◆ రాష్ట్ర స్థాయిలో జిల్లా వ్యవసాయ రంగం ర్యాంకు 20

◆ ప్రభుత్వ తాజా వృద్ధి ప్రణాళికలోనూ నిధుల లేమి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నీటి వనరులపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడంతో రాష్ట్ర స్థాయిలో జిల్లా వ్యవసాయ రంగం ర్యాంకు 20వ స్థానానికి పరిమితమైంది. ఇటీవల రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళికలో 2022-23కి సంబంధించి వ్యవసాయ రంగంలో పొందుపరిచిన వివరాలు ఆ విషయాన్ని పట్టిచూపాయి. జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో ఏటా 15 శాతం వృద్ధి సాధించేలా రూపొందించిన తాజా ప్రణాళికలో ప్రభుత్వ పెట్టుబడులు, నీటిపారుదల రంగం వృద్ధికి సంబంధించిన స్పష్టత కొరవడింది. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్‌లో భాగంగా 2029 నాటికి జిల్లా అభివృద్ధిలో గణనీయమైన మార్పులు జరుగనున్నట్లు పేర్కొన్న ప్రణాళికలో ప్రభుత్వ పెట్టుబడులు లేవు. 2024-25 నుంచి 2028-29 వరకు టూరిజం, పారిశ్రామిక, సేవా రంగాల్లో సాధించనున్న 15 శాతం వృద్ధిలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో క్లస్టర్లు, పారిశ్రామిక రంగంలో ప్రయివేటు పెట్టుబడుల హామీల ఆధారంగా వృద్ధిని గొప్పగా చూపారు. నీటి పారుదల వనరుల



అభివృద్ధికి తీసుకోబోయే చర్యలను వివరించకుండా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధిని సాధించనున్నట్లు ప్రణాళికలో పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల నుంచి 2024-25లో రూ.12,457 కోట్ల నుంచి 2028-29 నాటికి ఆ విలువ రూ.20,108 కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు.

పరవాడ, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట ప్రాంతాల్లో సెజ్‌లు, వివిధ పరిశ్రమలతో పారిశ్రామికంగా జిల్లా ర్యాంకు మూడో స్థానంలో వుంది. సేవా రంగంలో 23, జిల్లా స్థూల ఉత్పత్తిలో 15, తలసరి ఆదాయంలో 10వ స్థానంలో వుంది. రానున్న ఐదేళ్లలో పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్యం కింద నర్సీపట్నంలో వంద ఎకరాల్లో అల్లూరి జిల్లాలోని ఆర్గానిక్ పంటలకు సంబంధించి ప్రాసెసింగ్ క్లస్టర్, సబ్బవరంలో స్టోరేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లస్టర్, మాడుగులలో మిగతా 2లో..

కెజిహెచ్‌లో ఈ - పాలన

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జి ఆసుపత్రి (కెజిహెచ్)లో ఇకపై కాగిత రహిత పాలన (ఈ-పాలన) అమలు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని ప్రోత్సహించడంలో భాగంగా అన్ని ప్రభుత్వాసుపత్రులు, కార్యాలయాల్లో ఈ-ఆఫీసును పక్కాగా అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో కెజిహెచ్‌లో ఈ నూతన విధానం అమలుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా ఆసుపత్రులకు డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారులను ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్లుగా నియమించారని, ఈ క్రమంలో వారి ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో పాలన, టెండర్లు, ఆసుపత్రి అధివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉద్యోగులకు అవగాహన, అవసరమైతే శిక్షణ అందించి త్వరలోనే ప్రతి ఫైల్‌ను పక్కాగా ఆన్‌లైన్ (ఈ-ఆఫీస్)లోనే అమలు చేయనున్నట్లు శివానంద తెలిపారు. కెజిహెచ్‌లో చాలా విభాగాల్లో వచ్చిన ఫైల్స్‌కు నెలల తరబడి మోక్షం లభించడం లేదన్నారు. ఇకపై ప్రభుత్వపరంగా రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులకు సంబంధించి ఏ విషయమైనా ప్రతి ఫైల్‌కు ఒక నెంబర్ ఏర్పాటు చేసి వాటి ప్రకారం ఈ-ఆఫీస్‌లోనే ప్రతి ఫైల్ నడపాలన్నారు. ఏ ఫైల్ కూడా ఏ ఉద్యోగి వద్దా 48 గంటలకు మించి ఉండరాదనే ప్రభుత్వ నిబంధన అమలు చేయడంతోపాటు ఉద్యోగులు, సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులతో పాటు ఇతర ఫిర్యాదులను కూడా పది రోజుల వ్యవధిలోగా పరిష్కరించాలన్నారు.

చాలా మంది ఉద్యోగులు ఆఫీసుకు వచ్చి వారి సొంత పనులు చేసుకునేందుకు బయటకు వెళ్లిపోతున్నారని, అలాగే చాలా ఫిర్యాదులు, టెండర్లు, ఇతర అభివృద్ధికి సంబంధించిన ఫైల్స్‌కు కూడా మోక్షం లభించడం లేదనే విషయాన్ని తాజాగా గుర్తు చేశామన్నారు. ఈ క్రమంలోనే ఆయా అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ-ఆఫీస్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పరిపాలనాపరంగా తీసుకుంటున్న చర్యలపై సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్క సూపరింటెండెంట్ మాత్రమే పని చేయాలనే ఆలోచన సరికాదని, ఆర్ఎంఒలు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇతర నర్సింగ్ అధికారులు, ఆయా వార్డుల విభాగాధిపతులు కూడా ప్రభుత్వ ఆదేశాలను పక్కాగా పాటించాలని అన్నారు. త్వరలోనే రోగులకు సంబంధించిన ఓపీ సేవల మాదిరిగానే రక్త పరీక్షలు, ఇతర స్కానింగ్ రిపోర్టులను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి, ఆయా సేవలను సైతం మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

▶ వార్త 2లో..

బోసిపోయిన నగరం

▶ వార్త 2లో..

బల్క్ డ్రగ్ పార్క్ వస్తే ఉండలేం

▶ వార్త 8లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న నాయకులు

'ఉక్కు' నిర్వీర్య కుట్రలను తిప్పికొట్టండి

కొనసాగుతున్న జెసి దీక్షలు వార్త మెయిన్‌లో..

ముక్క.. మందు

కనుమ రోజున జోరుగా మద్యం, మాంసం విక్రయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కనుమ పండగ నేపథ్యంలో బుధవారం విశాఖ నగరంలో జోరుగా మాంసం విక్రయాలు సాగాయి. మందు ఏరులై పారింది. కనుమ రోజున మాంసం భుజించడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏ దుకాణం వద్ద చూసినా బుధవారం మాంసం కొనుగోలు చేసేవారు అధికంగా కనిపించారు. ఈ ఒక్క రోజునే నగరంలో రూ.3 కోట్ల మేర మటన్, చికెన్ అమ్మకాలు జరిగినట్లుగా తెలుస్తోంది. నూతన సంవత్సర వేడుకల పేరుతో మద్యం మత్తులో మునిగితేలిన మందుబాబులు మరోసారి సంక్రాంతి సందర్భంగా మత్తులో మునిగారు. విశాఖ జిల్లాలో డిసెంబర్ 31 ఒక్క రోజునే రికార్డు స్థాయిలో రూ.10.77 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సంక్రాంతి పండగకు కూడా మద్యం అమ్మకాలు అదే రీతిన జోరుగా సాగాయి. మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి, భీమిలి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 145 మద్యం దుకాణాలు ఉన్నాయి. నగరంలో గత ప్రభుత్వ కాలంలో సుమారు 125 వరకు మద్యం దుకాణాలు ఉండేవి. అవి కూటమి హయాంలో పెరిగాయి. నాణ్యమైన మద్యం మిగతా 2లో..



చికెన్ సెంటర్ వద్ద కొనుగోలుదారుల తాకిడి



నగరంలోని ఓ వైన్ షాప్ వద్ద సాగుతున్న అమ్మకాలు

మొదటి పేజీ తరువాయి..

నీటి వనరులపై శ్రద్ధ కరువు

కొబ్బరి క్లస్టర్, దేవరాపల్లిలో పౌల్ట్రీ క్లస్టర్, పూడిమడకలో ఆక్వా క్లస్టర్ అభివృద్ధికి అవకాశాలున్నట్లు అంచనా వేశారు. టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనుంది. బొజ్జన్నకొండ, తంతడి, సీతపాలెం బీచ్, కొండకర్ల ఆవను ఎకో టూరిజం హబ్‌గా తీర్చదిద్దనుంది.

2022-23లో రాష్ట్రంలో జిల్లా ర్యాంకు

రంగం	విలువ (కోట్లలో)	ర్యాంకు
వ్యవసాయం	10,285	20
పరిశ్రమలు	22,092	3
సేవారంగం	9,953	23
జిల్లా స్థూల ఉత్పత్తి	45,092	15
తలసరి ఆదాయం	2,10,214	10

ముక్క.. మందు

అమ్మతామని, క్వార్టర్ రూ.90కే ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ మేరకు ఏర్పాట్లు చేసింది. దీంతో మందుబాబులు మరింత ఎక్కువ తాగారు. కనుమ ఒక్క రోజునే సుమారు రూ.6 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని తెలుస్తోంది. గురువారం కూడా మద్యం అమ్మకాలు జోరుగా సాగే వీలుంది. బుధ, గురువారాలలో కలిపి కనీసం రూ.9 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరుగుతాయని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

కూలిన భారీ వృక్షం
- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఎల్లప్పుడూ రద్దీగా ఉండే ఎంవిపి రైతు బజార్ వద్ద బుధవారం పెను ప్రమాదం తప్పింది. రైతు బజార్ ప్రధాన ప్రవేశ ద్వారం ఎదురుగా ప్రధాన రహదారిపై ఎంతో కాలంగా ఎండిపోయి ఉన్న భారీ వృక్షం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా కుప్పకూలిపోయింది. సాధారణంగా ప్రతి రోజూ ఆ సమయంలో అక్కడ వందల సంఖ్యలో ప్రజలు తిరుగుతూ ఉంటారు. బుధవారం కనుమ పండుగ కావడంతో పాటు రైతు బజారు సెలవు అవడంతో ప్రజలు పెద్దగా లేకపోవటంతో పెను ప్రమాదమే తప్పింది. అంతేగాకుండా ఈ చెట్టు కూలిన ప్రాంతానికి ఐదు అడుగుల దూరంలో అన్న క్యాంటీన్ ఉంది. సాధారణ రోజుల్లో ఈ క్యాంటీన్‌కు వచ్చే ప్రజలు ఈ చెట్టు కిందనే క్యూ కడుతూ ఉంటారు. వారూ ఆ సమయంలో అక్కడ లేరు. చెట్టు కూలిన విషయం తెలుసుకున్న జివిఎంసి అధికారులు మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రమించి చెట్టును తొలగించి రోడ్డుపై రాకపోకలను పునరుద్ధరించారు.



భజన చెట్టును ఊరేగిస్తున్న గ్రామస్తులు

భజన చెట్టు ఊరేగింపు


ప్రజాశక్తి - మాధవధార : శ్రీ మాధవ యువజన సమాజం ఆధ్వర్యంలో కనుమ పండగ సందర్భంగా మాధవధార, కళింగ నగర్, తెన్నేటి నగర్ తదితర ప్రాంతాలలో భజన చెట్టును బుధవారం మాధవధార కోదండ రామాలయం భజన బృందంతో ఘనంగా ఊరేగించారు. ధనుర్మాసం సందర్భంగా మాధవధార కోదండ రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన భజన చెట్టుకు నెల రోజుల పాటు భక్తులు పూజలు నిర్వహించారు. శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్ గోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక భజన చెట్టును ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పూర్వం నుండి సంక్రాంతిని పురస్కరించుకొని కనుమ పండుగ రోజు ఊరేగింపు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్‌టివి.రమణ మూర్తి, నంబాల ఉదంతరావు, సనపల శంకర్రావు, సనపల నారాయణస్వామి, పప్పల శ్రీదేవి, కనుమటి రమణమూర్తి అధిక సంఖ్యలో మాధవధార గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భారత నాస్తిక సమాజం నేత సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత నాస్తిక సమాజం సీనియర్ నేత ఎంవివి.సత్యనారాయణ బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షునిగా కూడా ఆయన పనిచేశారు. సత్యనారాయణ మృతి పట్ల భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

ఘనంగా జాతర

ప్రజాశక్తి - ములగాడ : పారిశ్రామిక ప్రాంతమైన మల్కాపురం ప్రకాష్ నగర్‌లో ఏడు గుడుల అమ్మవారి జాతర బుధవారం ఘనంగా సాగింది. ప్రతి ఏటా ఈ జాతరను కనుమ రోజున వేడుకగా నిర్వహిస్తుంటారు. ఈ జాతరలో గ్రామ దేవతలకు పుర ప్రజలందరూ ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులు బోగవిల్లి నాగభూషణం, అధ్యక్షులు ఎం.మహేష్, కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, మజ్జి రమేష్, ఉరుకూటి రాజు, సురేష్ పాల్గొన్నారు.





నిర్మానుష్యంగా ఉన్న పాత జైలు రోడ్డు రహదారి, ద్వారకా ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని కూడలి

బోసిపోయిన నగరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగర వాసులంతా సంక్రాంతికి స్వస్థలాలకు తరలిపోవడంతో వాహనాల రద్దీ లేక జగదాంబ, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం, ఎంవిపి.కాలనీ వంటి కీలకమైన ప్రాంతాల్లోని రోడ్లు బుధవారమూ బోసిపోయాయి. ట్రాఫిక్ కూడళ్ల వద్ద రెడ్ సిగ్నల్ పడినా వాహనాలు పలుచగానే కనిపించాయి. జనాలు లేకపోవడంతో హోటళ్లలో విక్రయాలు తగ్గిపోయాయి. పెట్రోల్ బంకులు కూడా ఖాళీగానే దర్శనమిచ్చాయి.

స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

క్రికెట్ బుకీలతో సంబంధాలే కారణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం నగర స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి.గంగరాజుకు క్రికెట్ బుకీలతో సంబంధాలు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో ప్రాథమిక విచారణలో భాగంగా రెండు సంవత్సరాల కాల్ డేటాను పోలీసాధికారులు పరిశీలించారు. క్రికెట్ బుకీలతో ఆయనకు సంబంధాలు ఉన్నట్టు నిర్ధారణ అవడంతో పోలీసు కమిషనర్ చర్యలు తీసుకున్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అవినీతికి పాల్పడినా వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఎవరైనా లంచం అడిగినా, తీసుకున్నా వెంటనే 7995095799 నెంబర్‌కు తెలియజేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కమిషనరేట్ కార్యాలయ అధికారులు తెలిపారు.

గ్రేట్ రిపబ్లిక్ సేల్‌లో ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కొత్త సంవత్సరం సందర్భంగా తన బిజినెస్ కస్టమర్ల కోసం అమెజాన్ గ్రేట్ రిపబ్లిక్ డే సేల్‌లో పలు ఆఫర్లను ప్రకటించింది. ల్యాప్ టాప్స్, హెడ్ ఫోన్స్, రూమ్ హీటర్స్, కిచెన్ ఉపకరణాలు సహా విస్తృత శ్రేణి ఉత్పత్తుల్లో అత్యుత్తమ డీల్స్ ఉన్నట్లు ఆ సంస్థ ప్రతినిధి కె.ఎన్.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్డులోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కస్టమర్లు యాపిల్, ఏసర్, అసుస్, డెల్, హెచ్‌పి, లెనోవో, అమెజాన్ బేసిక్స్, బోట్, బౌల్ట్, ఫైర్-బోల్ట్, జెబిఎల్, నోయిస్, శామ్ సంగ్, సోనీ, గ్జియోమి, జిబ్రోనిక్స్ ఇంకా ఎన్నో బ్రాండ్స్‌పైన ప్రముఖ డీల్స్ పొందవచ్చునని పేర్కొన్నారు. స్మార్ట్ వాచీలు, స్పీకర్లు, ఆఫీస్ ఫర్నిచర్‌పై 70 శాతం వరకు తగ్గింపు లభిస్తుందని అన్నారు. హెడ్ ఫోన్స్‌పై 60 శాతం, ల్యాప్ టాప్స్, టాబ్లెట్స్‌పై 50 శాతం, రూమ్ హీటర్లపై 70 శాతం, ఎలక్ట్రిక్ కెటిల్స్, వాటర్ బాటిల్స్‌పై 50 శాతం వరకు తగ్గింపు ఉంటుందని తెలిపారు.

నకిలీ ఇన్వాయిస్‌ల సూత్రధారి అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనధికారిక గుర్తింపులను ఉపయోగించి షెల్ కంపెనీలు సృష్టించి తద్వారా 230 కోట్ల ఇన్వాయిస్‌లు తయారుచేసిన మోసానికి పాల్పడిన సూత్రధారి వెల్లూరులోని పెర్నంబట్‌కు చెందిన మహమ్మద్ నహీమ్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ విశాఖపట్నం జోనల్ యూనిట్ అధికారులు మంగళవారం తమిళనాడులోని హోసూరులో అరెస్టు చేయించారు. నహీమ్ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో ముందస్తు ప్రణాళిక ద్వారా 230 కోట్ల నకిలీ ఇన్వాయిసులు సృష్టించి వస్తువులు, పన్ను సేవలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసానికి పాల్పడ్డాడని, తద్వారా ప్రభుత్వానికి 35 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఆయన తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిములు రూపొందించి తద్వారా తప్పుడు జిఎస్‌టి ఇన్వాయిస్‌లను వ్యాపారులకు బదిలీ చేశాడని, అందుకోసం 80కి పైగా గుర్తింపు లేని షెల్ కంపెనీలను సృష్టించాడని వెల్లడించారు. ఆయన కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో గాలించగా తమిళనాడులోని హోసూరులో చిక్కాడన్నారు. అరెస్ట్ చేసి విశాఖకు తీసుకురాగా కోర్టు ఈ నెల 24వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్టు విశాఖపట్నం జోనల్ యూనిట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ ఎస్.మహమ్మద్ అలీ తెలిపారు.

మృతుని కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి -వీఆర్ పురం: మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో బుధవారం తాటిచెట్టు పైనుంచి పడడంతో తెల్లం బుర్రయ్య (40) అనే వ్యక్తి మృతి చెందాడు. పండుగ రోజున వ్యక్తి మృతి చెందడంతో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మృతి చెందిన బుర్రయ్యకు అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి కూడా స్తోమత లేని నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న జెకెటిసి ట్రస్ట్ బాధిత కుటుంబానికి అండగా నిలిచి, రూ.మూడు వేలు ఆర్థికసాయాన్ని అందజేసింది. దీంతో మృతుని కుటుంబీకులతోపాటు గ్రామస్తులు జెకెసి ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల రామారావుచ సర్పరాజు, ముత్యాల గోపి, ముత్యాల జలబాబు, కురసం శ్రీను, ముత్యాల మల్లికార్జునరావు, బింగి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పిల్లలకు మానవతా విలువలు నేర్పించాలి

కొణతాల రామలింగస్వామి స్మారక పురస్కార ప్రదానంలో ఎమ్మెల్యే రామకృష్ణ



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి : మానవతా విలువలు, బంధాలు, సంబంధాల విలువలపై పిల్లలకు బాల్యదశ నుంచి అలవరచాలని తల్లిదండ్రులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. ప్రతి ఒక్కరూ కృతజ్ఞతాభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరీ దేవస్థానం, ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణమండపంలో డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో నిస్వార్థ కార్యక్రమాలు చేస్తూ అందరికీ స్ఫూర్తిని కల్పిస్తున్న సమాజహితులను వ్యవసాయ డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్ పేరుతో పురస్కారాలిచ్చి, సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ కొణతాల రామలింగస్వామి కుటుంబ సభ్యులు సొంతనిధితో కృషి చేయడం అభినందనీయమన్నారు. పెరిగిన సాంకేతికత కారణంగా పిల్లల పర్యవేక్షణ ప్రస్తుతం సవాలుగా మారిందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు దండించినా తల్లిదండ్రులు వాస్తవాలు గ్రహించకుండా అభ్యంతరాలు వ్యక్తం చేయవద్దని హితవు పలికారు.

అనంతరం ఉపాధ్యాయ, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన డాక్టర్ బొంతలకోటి శంకరరావు (విజయనగరం), డాక్టర్ సి.గౌతమ్‌కుమార్ (సామాజిక సేవ-హైదరాబాద్), ఎల్లేటి మమత (సామాజిక సేవ-విశాఖపట్నం), నాగులు ఆదేషా (సామాజిక సేవ-ఒరిస్సా), ఉత్తమ విద్యార్థిగా రావాడా సాయి మోహిని మానస (శ్రీకాకుళం)లకు పురస్కారాలిచ్చి ఎమ్మెల్యే కొణతాల ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర విద్యుత్ నియంత్రణమండలి సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకురాలు కొణతాల లక్ష్మీపార్వతి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, ఆర్ఎఆర్ఎస్ విశ్రాంత ఎడిఆర్ వీరభద్రరావు, వివేకానంద విద్యాసంస్థల అధినేత మళ్ల జగదీష్, మళ్ల శైలజ, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), పొలమరశెట్టి చంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మంచినీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని కెపి.అగ్రహారంలో ఎంపిటిసి దేవరశెట్టి అప్పారావు నిధులతో వియ్యపు, బొబ్బిలి వారి కల్లాల వద్ద తాగునీటి బోరు వేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తగా అవసరమైన చోట బోర్లు, తాగునీటి సౌకర్యం కల్పనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిపి దాకవరపు నాగేశ్వరావుదేవి, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు దేవర అప్పారావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, శంకుస్థాపన చేశారు. సీనియర్ నాయకులు అడ్డూరి శ్రీను, టి. నూకరాజు, జనసేన మండల కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు వియ్యపు నాగేశ్వరావు, తెలుగు యువత అధ్యక్షులు దేవర బుల్లినాయుడు పాల్గొన్నారు

'బూడి' వాహనాన్ని ఢీకొట్టిన బైక్

ప్రజాశక్తి- దేవరాపల్లి: మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వాహనాన్ని బైక్ ఢీకొట్టిన ఘటన చోటచేసుకుంది. మాజీ మంత్రి బూడి తనయుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు ఎస్ఐ టి. మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. బుధవారం మధ్యాహ్నం తారువ నుంచి దేవరాపల్లి వస్తున్న మాజీ మంత్రి వాహనాన్ని మారేపల్లి సమీపంలో రోడ్డు మలుపులో ఎదురుగా వేగంగా వస్తున్న బైక్ ఢీకొట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.

వైసిపి యూత్ జిల్లా అధ్యక్షునిగా వెంకటేష్



వెంకటేశ్ ను అభినందిస్తున్న జగన్, ధర్మశ్రీలు

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి యువజన విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా చోడవరం పంచాయతీ అన్నవరానికి చెందిన పుల్లేటి వెంకటేష్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. 14 ఏళ్లగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి, జిల్లా యూత్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పార్టీ పెద్దలు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి, వైసిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గానికి ఐదు జిల్లా పదవులు

వైసిపి అనుబంధ విభాగాలకు సంబంధించి చోడవరం నియోజకవర్గానికి ఐదు పదవులు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. వైసిపి యూత్ జిల్లా అధ్యక్షునిగా వెంకటేష్, రైతు విభాగానికి చోడవరం మాజీ జెడ్‌పిటిసి బొడ్డేడ సూర్యనారాయణ, వికలాంగుల విభాగానికి రావికమతం మండలం తోటకూర పాలేనికి చెందిన రుత్తల భాస్కరరావు సోషల్ మీడియా విభాగానికి అధ్యక్షునిగా రోలుగుంట మండలానికి చెందిన గుర్రాల నాగేశ్వరావు, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షునిగా చోడవరానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ పోకల తిరుపతిరావులను పార్టీ అధిష్టానం నియమించిందన్నారు.

45 మంది యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- అనకాపల్లి : రక్తదానం మరొకరికి ప్రాణదానంలా నిలుస్తుందని అభినవ భారత్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు భవాని శంకర్, వంకర రాజు అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డు వద్ద బి-వన్ హాస్పిటల్ ప్రాంగణంలో బుధవారర సంస్థ ఆధ్వర్యంలో అమ్మ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మెగా వాలంటరీ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి పలు గ్రామాల నుంచి 45 మంది యువకులు హాజరై రక్తదానం చేశారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కిరణ్, డాక్టర్ గంగాధర్ రక్తదాతలను అభినందించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్గనైజర్ ఎస్.మహేష్, ఎం.సంతోష్ కుమార్, శ్యామ్, శ్రీను, ఆర్.బోసు, పి.నాగేష్, అవినాష్, స్టాలిన్, రమణాజీ, ముత్తూట్ స్టాఫ్ ఎమ్.గణేష్, నాయుడు, కె.కె.యం.సతీష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తాగునీటిని వృథా చేయొద్దని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హితవు పలికారు. బుధవారం. ఎం జగన్నాధపురం గ్రామంలో పర్యటించారు. నూతనంగా నిర్మిస్తున్న కొండవాలు కల్వర్టును పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ జలజీవన్‌మిషన్ ద్వారా సరఫరా చేస్తున్న కుళాయిల తాగునీరు వృథాగా పోతుండడాన్ని గుర్తించారు. నీటి వృథా సరికాదని హితవు పలికారు. బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. రహదారులపై అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని బాలిక దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : కారు ఢీకొని ఐదేళ్ల బాలిక దుర్మరణం చెందిన ఘటన గాజువాక సెలెస్ట్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలివి. సుజాతనగర్ సాత్వి రెసిడెన్సీ చెందిన భోగిర్ల లారిణి (5) తన తండ్రి నవీన్ కుమార్‌తో కలిసి గాజువాక లంక గ్రౌండ్ పక్కన ఉన్న సెలెస్ట్ అపార్టుమెంట్లోని బంధువుల ఇంటికి వచ్చారు. అపార్ట్మెంట్ పార్కింగ్ ప్లేస్‌లో బాలిక ఆడుకుంటుండగా, అపార్ట్మెంటుకు ఒక కారు హారన్ మోగించకుండా, నిర్లక్ష్యంగా స్పీడ్‌గా డ్రైవింగ్ చేస్తూ పాపని ఢీకొనడంతో, కారు పాప శరీరంపైకి కారు చక్రాలు దూసుకెళ్లడంతో తీవ్ర రక్తస్రావమైంది, వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -మధురవాడ: జాతీయ రహదారిపై కారుషెడ్ కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మతి చెందినట్లు సీఐ జి. బాలకృష్ణ తెలిపారు పద్మనాభం మండలం పాండ్రంగి కి చెందిన మైలపల్లి శ్రీను తన భార్య చందు (28)తో కలిసి ద్విచక్ర వాహనంపై నగరంలోని వెంకోజీపాలెం నుంచి పాండ్రంగి వస్తుండగా, కారుషెడ్ వద్ద వీరి బైక్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో చందు అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- పెందుర్తి : మండలం చింతగట్ల గ్రామంలో యువతి ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి సిఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాలివి. చింతగట్లకు చెందిన గనిశెట్టి పార్వతి(30). ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. భర్త కనకరాజుతో ఆమెకు విభేదాలున్నట్లు బంధువుల సమాచారం. దీంతో మంగళవారం ఆత్మహత్యకు ఒడిగట్టింది. సమాచారంఅందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - యలమంచిలి : మండల పరిధిలోని తురంగలపాలెం, మున్సిపాలిటీ పరిధిలోని పెదపల్లి, ఏటికొప్పాక గ్రామాల్లో మంగళవారం కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ, రూరల్ పోలీసులు తెలిపారు. వారి వద్దనుంచి ఆరు కోడి పుంజులు, రూ.2,200 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. యలమంచిలి టౌన్ ఆర్టీ క్లబ్‌రోడ్డులో ఈద్గా దగ్గర పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తుల్ని పట్టుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు టౌన్ పోలీసులు తెలిపారు. మరోవ్యక్తి వద్ద పది సీసాలు మద్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

జూదరులపై కేసు

ప్రజాశక్తి పద్మనాభం: మండలంలోని కోరాడ గ్రామపంచాయతీకోరాడ సచివాలయం వెనక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 5650 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ తెలిపారు.

తారువలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని తారువలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి వామి దగ్ధమయ్యింది. రోడ్డు పక్కనే ఉన్న బూడి మర్లతల్లినాయుడుకు చెందిన కల్లం సమీపంలో గ్రామదేవత మర్లమాంబ అమ్మవారి తీర్థం జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రజలు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు స్పందించి మంటల్ని అదుపు చేసే ప్రయత్నం చేస్తూనే చోడవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ప్రమాద స్థలికి చేరుకున్న అగ్నిమాపక శకటం సకాలంలో వచ్చి మంటల్ని అదుపు చెయ్యడంతో పెద్దగా ఆస్తి నష్టం జరగలేదు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

నిర్మించి వదిలేశారు...



నిర్మాణమైనా వినియోగంలోకి రాని దుకాణ సముదాయం

ప్రజాశక్తి – ఆరిలోవ : ఆరిలోవ కాలనీలో జీవిఎంసి నిధులతో నిర్మించిన దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. రూ.50 లక్షలతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌ను అధికారులు ఇంతవరకు ఉపయోగంలోకి తీసుకురాలేదు. దీంతో ఈ దుకాణ సముదాయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. 13వ వార్డు ఆరిలోవ కాలనీ కనకమహాలక్ష్మీనగర్‌ను ఆనుకొని ప్రభుత్వానికి చెందిన సుమారు అరఎకరా ఖాళీ స్థలంలో జీవిఎంసి అధికారులు 2018లో రూ.50 లక్షలతో 42 షాపులతో దుకాణాల సముదాయం నిర్మించారు. పూర్వం నుంచి ఆరిలోవ కాలనీ, వెర్నిదుర్గానగర్‌లో దుర్గాబజార్ దుకాణ సముదాయం ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో అక్కడి నుంచి కొన్ని దుకాణాలు ఇక్కడకు తరలించాలని, వాటితో పాటు చేపల విక్రయాలు జరిగేలా అధికారులు సన్నాహాలు చేశారు. రైతుబజార్ దూరంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్న స్థానికులకు కొంతవరకైనా కష్టాలు తీరుతాయని భావించారు. ఈ క్రమంలో 2019 నాటికి ఈ సముదాయ నిర్మాణం పూర్తయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు జీవిఎంసి అధికారులు ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

ఆరిలోవ కాలనీ చివరిగా ఈ షాపింగ్ కాంప్లెక్స్ ఉండడం, దీనికి తోడు సుమారు 10 మీటర్ల దూరంలో వైన్‌షాపు, బార్‌లు వరుసగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. పగలు, రాత్రి సమయాలలో మందుబాబులు అక్కడే దర్జాగా మందు తాగి అక్కడే సీసాలు పగుల గొట్టి వీరంగం సృష్టిస్తున్నారు. రాత్రి సమయంలో అటువైపు వెళ్లాలంటే స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

చేపల విక్రయాలకు కేటాయిస్తే మంచిది..

తోటగరువు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకొని ఉన్న రెవెన్యూ స్థలంలో ఇప్పటికే రైతుబజార్‌ను నిర్మించారు. మరికొన్ని రోజుల్లో రైతుబజార్ అందుబాటులోకి రానుంది. ఈ ప్రాంతంలో ఫిష్ మార్కెట్ అందుబాటులో లేదు. చాలా మంది చేపల విక్రయదారులు రహదారి పక్కనే ఎక్కడికక్కడ తమ దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయాలు చేసుకుంటున్నారు. దీని వల్ల ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. వీరందరిని ఈ దుకాణ సముదాయంలో స్టాల్స్ ఏర్పాటుచేసుకొని విక్రయాలు జరిపితే మంచిదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఆలోచించి దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు సుందరీకరణ జరిగేనా?

విడతల వారీగా మంజూరైన రూ.కోట్ల నిధులు నీరుగారుతున్నట్టేనా?



సుందరీకరణకు నోచుకోని చిట్టివలస, చిల్లపేట పెద్ద చెరువు ఇదే...

ప్రజాశక్తి –తగరపువలస : జీవిఎంసి ఒకటో వార్డు చిట్టివలస, చిల్లపేట పెద్ద చెరువు అభివృద్ధి పనుల్లో ఎడతెగని జాప్యం నెలకొంది. దుర్వాసన వస్తుందని స్థానికులు, పరిసర ప్రాంత ప్రజలు జీవిఎంసి అధికారులకు ఫిర్యాదులు చేయడం పరిపాటిగా మారింది. ఫిర్యాదులు అందిన వెంటనే జోనల్ అధికారులు చెరువును సందర్శించడం, పూడిక తీత పనులు చేపట్టడం షరా మామూలుగానే సాగుతోంది. గత కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. చెరువు అభివృద్ధి జాడ లేదు. సుందరీకరణ ఊసే లేదు. తమకు ఓట్లేసి గెలిపిస్తే చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో సుందరీకరణ చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇస్తూనే అన్నారు. శిలా ఫలకాలు వేస్తూనే ఉన్నారు. చెరువు అభివృద్ధి మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు' ఉందని చెప్పొచ్చు.

నాడు పంట భూములు.. నేడు ప్లాట్లు...

కారణాలు ఏమైనా గానీ ఒకనాడు ఆహార పంటలు పండించే పంట భూముల స్థానంలో నేడు ప్లాట్లు ఏర్పడి బహుళ అంతస్తుల భవనాలు ఇబ్బడి ముబ్బడిగా నిర్మితమై ఉన్నాయి. 36 ఎకరాల చెరువు గర్భం, 94 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువు కింద ఒకప్పుడు 26 ఎకరాల్లో వరి, 8 ఎకరాల్లో కొబ్బరి, మరో 8 ఎకరాల్లో సరుగుడు సాగు చేసేవారమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం నాలుగెకరాల విస్తీర్ణంలో నీరు నిల్వ ఉన్నట్లుగా చెబుతున్నారు. చెరువుకు ఉన్న మూడు మదుముల్లో రెండింటిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ సొంత ప్రయోజనాల కోసం మూసేసారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చెరువులోని నీరు బయటకు వెళ్లే వీలు లేకపోవడంతో నెలల తరబడి మురిగి పోయి దుర్వాసన వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటు సంగివలస మొదలు చిట్టివలస, తగరపువలస చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా నిర్మితమైన భవనాల్లోంచి వాడుక నీరు కాల్వల ద్వారా చెరువుల్లో చేరిపోయి నిల్వ ఉండడంతో దుర్వాసన సమస్య మరింత తీవ్రంగా ఉందని స్థానికులు అంటున్నారు.

సుందరీకరణ శిలాఫలకాలకే పరిమితం

36 ఎకరాలు ఉండాల్సిన చెరువు గర్భం విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూవస్తోంది. అయిన సరే పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సుందరీకరణ అంటూ హడావిడి మాత్రం చేస్తున్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహా అభివృద్ధి చేస్తామంటూ అధికారంలో ఉన్న టిడిపి, వైసిపి ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి, నిధులు మంజూరు చేసి, శంకుస్థాపనలు చేసినా పనుల్లో పురోగతి కనిపించలేదు. గత టిడిపి హయంలో రూ.1.98 కోట్లు నిధులు మంజూరు కాగా, అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 2018 డిసెంబర్ 1న శంకుస్థాపన చేశారు. చెరువు అభివృద్ధి అంటూ హడావిడి చేసినా పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. చెరువు చుట్టూరా గట్టు పటిష్టం చేశారు.

వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.6.50 కోట్లతో పునరుద్ధరణ పనులు పేరిట అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 2023 జులై 1న శిలాఫలకం వేశారు. కొంత మేరకు చెరువు గట్టు పటిష్ట వంతం పనులు చేపట్టారు. అనంతరం పలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. చెరువు అభివృద్ధి కోసమని ప్రభుత్వాలు మారినపుడల్లా మంజూరవుతున్న నిధులు ఏమౌతున్నట్లు అన్న సందేహం సర్వత్రా నెలకొంది.

గాజువాకలో ఇళ్లు ఖాళీ?

- స్టీల్‌ప్లాంట్ నిర్వీర్య ప్రభావం పడుతుందంటున్న స్థానికులు
- ఎక్కడ చూసినా టూలెట్ బోర్డులే దర్శనం



టూలెట్ బోర్డులతో దర్శనమిస్తున్న ఇల్లు

ప్రజాశక్తి –గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కాకముందు గాజువాక చిన్న పల్లెటూరుగా ఉండేది. స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత గాజువాక పట్టణంగా మారింది. క్రమేపి షీలానగర్ నుంచి అగనంపూడి వరకు విస్తరించింది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, దానిపై ఆధారపడి జీవిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నివాస అవసరాలు పెరగడంతో గాజువాకలో గృహ నిర్మాణాలు పెరిగాయి. ఇళ్లను ఎక్కువగా నిర్మించి అద్దెలకు ఇచ్చుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. నిత్యం కళకళలాడే గాజువాక నగరం నేడు టూలెట్ బోర్డులతో దర్శనమిస్తోంది. ఒకప్పుడు ఇల్లు అద్దెకు కావాలంటే దొరకని పరిస్థితి ఉండేది. మూడు నెలలుగా దానికి భిన్నంగా గాజువాకలో ఏ సందులో చూసినా టూలెట్ బోర్డులే కనిపిస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంటు కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించడం తదితర పరిణామాలతో చాలామంది సొంత గ్రామాలకు తరలి వెళ్తున్నారు. మరి కొంతమంది ఢిల్లీ, ముంబాయి వంటి నగరాలకు వెళ్లిపోతుండటంతో గాజువాక ఖాళీ అవుతోంది. సమతానగర్, ఉడా కాలనీ, శ్రీనగర్, ఆఫీసర్ కాలనీ, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, షీలానగర్‌లో గృహాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. రూ.7000 అద్దెకిచ్చే గృహాలను నేడు రూ.5000కు ఇస్తామంటున్నా ఎవరూ రావడంలేదు. చాలామంది వ్యాపారస్తులు, ఉద్యోగ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగస్తులు వచ్చిన డబ్బుతో ఇళ్ల నిర్మాణాలు చేశారు. వచ్చిన ఇంటి అద్దెతో రిటైర్మెంట్ జీవితం సుఖంగా గడుపుదామనుకున్నారు. ప్రస్తుతం అద్దెకు దిగడానికి ఎవరూ రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రత్యక్షంగా పరోక్షంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి లక్ష మంది జీవించేవారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుండటంతో చాలామంది అవకాశాలు ఉన్న దగ్గరకు తరలిపోతున్నారు.

గాజువాక మార్కెట్‌పైనా ప్రభావం

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్న ప్రభావం గాజువాక మార్కెట్‌పైనా కూడా కనబడింది. క్రిస్మస్, సంక్రాంతి పండగల సమయంలో ఎంతో హడావిడిగా కనిపించిన పాత గాజువాకలో నేడు ఆ పరిస్థితి కానరావడంలేదు. షాపింగ్ మాల్స్‌లో గతంలో మాదిరిగా వ్యాపారాలు సాగలేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. విపరీతమైన ఆఫర్స్ ప్రకటించినా స్టీల్ ప్లాంట్ కార్మికులకు జీతాలు లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించినట్లు స్పష్టమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే గాజువాక పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ఉద్యోగస్తులు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేశారు. ఇప్పుడు వారు ప్రతి నెలా ఇఎంఐ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు

ప్రజాశక్తి –గాజువాక : గాజువాక నియోజవర్గ పరిధి ఉడా కాలనీలో ఉన్న ఏడు ఎకరాల ఉడా స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం నాలుగుసార్లు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి తప్ప, పనులు జరగలేదు. 2004వ సంవత్సరంలో సిఎస్ఆర్ కింద హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ యాజమాన్యం నిధులిచ్చినా పనులు చేపట్టలేదు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం సంబంధించి శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు చేపట్టారు. అయితే గ్రౌండ్‌లో ఆదర్శ స్కూల్ ఉండడంతో వారు అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు నిలిచిపోయాయి. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆదర్శ పాఠశాలకు విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన స్థలం కేటాయించారు. ఆ స్థలంలో స్కూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది నుంచి స్కూలు తరలిస్తామని పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. దీంతో అక్కడ క్లియరెన్స్ లభించడంతో ఆదర్శ గ్రౌండ్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పది రోజులుగా జరుగుతున్నాయి. ఇప్పటికే పిల్లర్స్ పూర్తయ్యాయి. ఈ కాంప్లెక్స్ నిర్మాణం జరిగితే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. గాజువాక నియోజకవర్గం మొత్తానికి ఇక్కడ తప్ప మరెక్కడా ప్రభుత్వ స్థలం లేదు. క్రీడాకారులు ఆడుకోవడానికి ఈ స్థలం అనుకూలంగా ఉంది. గాజువాకలో ఇప్పటికీ ముగ్గురు క్రీడాకారులు క్రికెట్‌లో రాణించారు. ఇంకా మరికొందరు క్రీడాకారులు పలు పోటీల్లో రాణిస్తున్నారు. దీంతో క్రీడాకారుల్లో ఉత్సాహం కలుగుతోంది. గతంలో జింక్ గ్రౌండ్ ఉండేది. ఆ పరిశ్రమ మూత పడిపోయిన తర్వాత ఆ గ్రౌండ్ కూడా అందుబాటులో లేకుండా పోయింది. దీంతో ఆదర్శ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఏడాది కల్లా ఈ నిర్మాణ పనులు పూర్తవుతాయని జివిఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంఆర్ఎఫ్ అప్పారావు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న క్రీడాకారుల కల నెరవేరబోతోంది.



జోరుగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

పింఛన్ల మంజూరు ఎప్పుడో?



- భర్త చనిపోయిన వారికి స్పౌజ్ కేటగిరీ కింద కొత్తగా మంజూరు
- వందలాది మంది పాతవారు ఎదురు చూపు
- ఏడాదిన్నరగా ఏ పింఛన్లూ మంజూరు చేయని వైనం
- టిడిపి కూటమి హామీ నిలబెట్టుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

వితంతు పింఛన్ల కోసం జిల్లాలో వందలాది మంది ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో చనిపోతే ఆయన భార్యకు వెంటనే స్పౌజ్ కేటగిరీ పింఛను మంజూరు చేశారు. కాని ఏడాదిన్నరగా వితంతు పింఛన్లతో పాటు ఏ ఒక్క పింఛను కూడా కొత్తవి మంజూరు చేయకపోవడంతో అనేక మంది అర్హులు తమ జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో సుమారు ఏడాది పాటు వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లతో పాటు ఏ రకమైనా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఈ కాలంలో అనేక మంది భర్తలు చనిపోయినా వారి భార్యలకు వితంతు పింఛన్లు కూడా మంజూరు కాలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. అయితే ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు ఆ పింఛను వెంటనే మంజూరు చేసే విధానాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం 2024 డిసెంబర్ నెల నుండి అమలు చేసింది. దీనిని స్పౌజ్ కేటగిరీగా పేర్కొంటూ పింఛను మంజూరు చేస్తోంది.

అయితే గత వైసిపి ప్రభుత్వంలో ఏడాది పాటు, కూటమి ప్రభుత్వంలో 2024 నవంబర్ నెలకు ముందు భర్తలు చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మంజూరు చేయలేదు. ఈ ఏడాదిన్నర కాలంలో బుచ్చయ్యపేట మండలంలోని 35 గ్రామాలలో వందలాది మంది అప్పటికే పింఛన్లు పొందుతూ మృతి చెందిన వారు ఉండగా, వారి భార్యలకు పింఛన్లు మంజూరు కాలేదు. ఇలా ప్రతి గ్రామంలోనూ పది నుండి 20 మంది వరకు వితంతు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాదిన్నర కాలంగా మండలంలోని దిబ్బిడి గ్రామంలో 15 మంది, బుచ్చయ్యపేటలో 31 మంది వరకు మృతి చెందగా, వారి భార్యలు స్పౌజ్ పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా మండలంలోని ప్రతి గ్రామంలోనూ వితంతు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వారు అనేక మంది ఉన్నారు.

దీనికి తోడు గత వైసిపి ప్రభుత్వ హయాంలో తొలగించిన పెన్షనుదారులు మండలంలో సుమారు 70 మంది వరకు ఉన్నారు. ఒకే రేషన్ కార్డులో ఇద్దరు లబ్ధిదారులు ఉన్నారన్న కారణంతో గత ప్రభుత్వం 70- 80 సంవత్సరాలు ఉన్న వృద్ధుల పెన్షన్లను సైతం తొలగించింది. పింఛన్లు లేక వీరంతా సుమారు ఐదేళ్ల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పింఛన్లను పునరుద్ధరిస్తామని టిడిపి కూటమి పెద్దల హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు 2024 నవంబర్‌కు ముందు భర్తలు చనిపోయిన భార్యలకు వితంతు పింఛన్లతో పాటు ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్న వికలాంగ, వృద్ధాప్య, ఇతర పింఛన్లు మంజూరు చేయాలని సంబంధిత పింఛన్ల అర్హులు కోరుతున్నారు.



పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా ఉన్న రాజాం-తట్టబంద రహదారి

రాజాం-తట్టబంద రోడ్డు అధ్వానం

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం-తట్టబంద రోడ్డు అధ్వానంగా ఉంది. రాజాం నుండి తురకలపూడి వెళ్లే వరకు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో వాహనదారులకు నరకప్రాయంగా మారింది. నిత్యం ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. రాజాం, తట్టబంద, రావికమతం తదితర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వివిధ పనులు, ఉపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు శిథిలం కావడంతో చిన్నపాటి వర్షం పడినా గోతులలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రాజాం, తురకలపూడి వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 12 కిలోమీటర్ల రోడ్డులో ఐదు కిలోమీటర్లు రోడ్డు మరీ అధ్వానంగా మారింది. దీనిపై తురకలపూడికి చెందిన మంత్రి కృష్ణ అనే యువకుడు ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుకు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారని, రోడ్డు పరిశీలించి రూ.158 లక్షలతో ప్రతిపాదన సిద్ధం చేశారని కృష్ణ తెలిపారు. త్వరితగతిన నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన కోరుతున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డా

- కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై పలు ఫిర్యాదులు
- ఉన్నతాధికారుల విచారణలో బయటపడిన అక్రమాలు
- సబ్ రిజిస్ట్రార్‌పై బదిలీ వేటు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఫిర్యాదులు రావడంతో వెంట వెంటనే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో కొద్దికాలంలో ఉద్యోగ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్‌ను బదిలీ చేశారు.

స్థానిక సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ మూడు నెలల కిందట కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఆయన వచ్చిన దగ్గరనుంచి ఇతర కార్యాలయాల పరిధిలో ఉన్న డాక్యుమెంట్లపై దృష్టి పెట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో విశాఖకు సమీపంలో ఉన్న తుంగ్లాం ప్రాంతానికి చెందిన గిఫ్ట్ సెటిల్మెంట్, నరవకు చెందిన నోషనల్ ఖాతా డాక్యుమెంట్, చంద్రయ్య పేటకు చెందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లపైనా అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ఇందులో బాధితులు కొందరు కోర్టుకు వెళ్లి నోటీసులు పంపడంతో అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ మాధవరావు కె.కోటపాడు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేపట్టి డాక్యుమెంట్లను పరిశీలించారు. డాక్యుమెంట్లలో అక్రమాలు జరిగింది వాస్తవమేనని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మరో మూడు నెలల్లో ఉద్యోగ విరమణ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణను విశాఖలో చిట్స్ సహాయ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అదే స్థానంలో ఉన్న ఆర్.శకుంతలను కె.కోటపాడుకు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై పంపించారు. ఈ విషయాలపై జిల్లా రిజిస్ట్రార్ మాధవరావును వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా చేయకూడని డాక్యుమెంట్లు చేశారని, వాటిపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని చెప్పారు. తదుపరి ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణపై చర్యలు ఉంటాయి వెల్లడించారు.

నిరుపయోగంగా బీసీ బాలికల హాస్టల్ భవనం

శిథిలావస్థకు చేరుకుంటున్న వైనం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండల కేంద్రం కె.కోటపాడులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం భవనం నిరుపయోగంగా ఉంది. 25 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ వసతి గృహం భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంటోంది. వసతి గృహ ఆవరణలో పొదలు, చెట్లు పెరిగి వసతి గృహం రూపురేఖలు మారిపోయాయి. గతంలో నిత్యం బాలికలతో కళకళలాడే ఈ వసతి గృహం నేడు కళావిహీనంగా మారింది. ప్రభుత్వ ఆవాస విద్యాలయాలు పెరిగిన తర్వాత ఈ బాలికల వసతి గృహానికి వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. విద్యార్థులు లేక ఈ హాస్టల్ మూత పడింది. నేడు దీనిని పరిశుభ్రం చేసే నాథుడు లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రస్తుతం ప్రభుత్వ వ్యాయామశాలకు చెందిన పరికరాలు ఒక గదిలో ఉన్నాయి. దీంతో ప్రతిరోజు కొందరు యువకులు అక్కడ వ్యాయామ సాధన చేస్తున్నారు. దీనికి సోలార్ విద్యుత్తు సౌకర్యం కూడా ఉంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ భవనంలో ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని నిర్వహణ చేసి భవనాన్ని వినియోగంలో తేవాలని పలువురు కోరుతున్నారు.



మూతపడి ఉన్న హాస్టల్ భవనం

క్షతగాత్రునికి సిఐటియు నేత పరామర్శ



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రసూల్ డెక్కర్ పరిశ్రమలో ప్రమాదంలో గాయపడి, కుడిచేయి కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు కె పోలిరాజును బుధవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి,మనోధైర్యం కల్పించారు.బాధిత కార్మికుడికి మెరుగైన చికిత్స, వారి కుటుంబానికి తగు పరిహారం, జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

క్రీడలు సఖ్యతకు దోహదం

ప్రజాశక్తి- కె.కోటపాడు : గ్రామాలు, ప్రజల మధ్య సఖ్యతకు క్రీడలుదోహదపడతాయని ఎపి రైతుసంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు అన్నారు. బుధవారం మండలంలోని పోతనవలస గ్రామంలో బంగారమ్మ తల్లి తీర్థం సందర్భంగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విజేతలకు ఈనెల 16న బహుమతులు అందజేస్తారు.దొంగలి రామకృష్ణ, బొడ్డు నాని, బండారు రమణ. సిరికి శివ పాల్గొన్నారు

శోభన్‌బాబుకు ఘననివాళి



కేక్ కట్ చేస్తున్న నటభూషణ్ అభిమానులు

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగు సినీ హీరో నటభూషణ్ శోభన్ బాబు జయంతిని బుధవారం స్థానిక విజయరామరాజుపేటలో నిర్వహించారు. శోభన్ బాబు చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించి, కేక్ కట్ చేసి అందరికీ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలక రాము, బొబ్బిలి అప్పారావు, పిట్ల గుడ్డేశ్వరరావు, పలక సత్యనారాయణ, గండి బోయిన సత్తిబాబు, అప్పికొండ వెంకట్రావు, పల్లా శ్రీను, పలక మురళి, పల్లా సత్య అప్పారావు, పసుపులేటి అప్పారావు, అప్పికొండ మహేష్, విజయరామరాజుపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్‌కు ఆంధ్రా అంధుల మహిళల జట్టు

ప్రజాశక్తి -మధురవాడ :జాతీయ అంధుల మహిళా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో భాగంగా ఆంధ్రా అంధుల జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో జరుగుతున్న పోటీల్లో బుధవారం మూడవ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర, తెలంగాణ జట్లు తలపడగా, ఆంధ్రా జట్టు విజయం సాధించి, క్వార్టర్స్‌కు చేరుకుంది.టాస్ గెలిచి బాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర మహిళా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. సుజాత 31బంతుల్లో 56 పరుగులు, సారిక 38 బంతుల్లో 53 పరుగులతో ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పగా మిడిల్ ఆర్డర్‌లో రవని 20 బంతుల్లో 56 పరుగులు, రమ్య 20 బంతుల్లో 34 పరుగులు చేసి భారీ స్కోర్ చేశారు. అనంతరం 227 పరుగుల లక్ష్యంతో బాటింగ్ దిగిన తెలంగాణా జట్టు 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 178 మాత్రమే చేయగలిగింది. 48 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ లోకి ప్రవేశించింది. ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచిన రవనికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

కనుల పండువగా గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి -పద్మనాభం: కనుమ పండుగను పురస్కరించుకుని స్థానిక అనంత పద్మనాభస్వామి సన్నిధిలో కుంతీ మాధవస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకిలో ప్రతిష్ఠించి గిరి ప్రదక్షిణ బుధవారం ఘనంగా నిర్వహించారు బుధవారం కనుమ రోజు ఉదయం 8గంటల స్వామి గిరి ప్రదక్షిణను ఆలయ అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో కనులపండువగా సాగింది.

బుద్ధుని బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకం

బౌద్ధ మేళాలో బౌద్ధ భిక్షువులు : కనులపండువగా బొజ్జన్నకొండ తీర్థం

ప్రజాశక్తి-అనకాపల్లి : బుద్ధుని బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకాలని నాగపూర్ బుద్ధగయ అఖిలభారత బౌద్ధ సంఘం భిక్షువులు వెనరబుల్ జ్ఞానదీప్ మహాథేరో అన్నారు. బుధవారం అనకాపల్లి బొజ్జన్నకొండ వద్ద ఉమ్మడి విశాఖ జిల్లాల బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బౌద్ధ భిక్షువులు బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బౌద్ధాభిమానులు, బౌద్ధ ఉపాసకులు, పర్యాటక సందర్శకులతో కలిసి మహాబౌద్ధమేళా నిర్వహించారు. ముందుగా బొజ్జన్నకొండ మెట్ల మార్గం ద్వారా బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బౌద్ధ పతాకాలు, బుద్ధుని ప్రతిమలతో కొండపై గల బౌద్ధగుహ వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. తదుపరి కొండపై గల ప్రధాన బౌద్ధ గుహలో బౌద్ధ స్థూపము వద్ద నాగపూర్ నుండి తీసుకు వచ్చిన బుద్ధుని ధాతువులతో ప్రత్యేక పూజలు ప్రార్థనలు చేశారు. బుద్ధుని పంచశీల సూత్రాలను, బొజ్జన్న కొండ విశిష్టతలను వివరించారు. అనంతరము కొండ దిగువన.సభలో బుద్ధభూమి మాసపత్రిక, మనభూమి కేలండర్లను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, పవార కార్యదర్శి బల్లా నాగభూషణం, అంబేద్కర్ సొసైటీ విశాఖజిల్లా అధ్యక్షులు బొడ్డు కల్యాణ రావు, బౌద్ధ సంఘాల సమాఖ్య కోశాధికారి పెయ్యల సిద్ధార్థ, సమాఖ్య గౌరవాధ్యక్షులు గొంది నవీన్, సమాఖ్య ప్రతినిధులు ఝాన్సీరాణి, ఇతర బౌద్ధ సంఘాల సభ్యులు, బౌద్ధ ఉపాసకులు, పర్యాటకులు, సందర్శకులు పాల్గొన్నారు.



బొజ్జన్నకొండపై బౌద్ధమేళాలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు



బౌద్ధమేళాకు భారీగా తరలివచ్చిన భక్తులు, ప్రజలు

బొజ్జన్న కొండకు పోటెత్తిన సందర్శకులు

కనుమ పండుగ సందర్భంగా బొజ్జన్న కొండ వద్ద నిర్వహించిన తీర్థానికి జిల్లా నలుమూలల నుంచి బొజ్జన్న కొండ, లింగాల కొండకు సందర్శకులు పోటెత్తారు. బొజ్జన్న కొండ ప్రధాన గుహ, కొండపైన దొంగోని గుహ, సీతమ్మ చాప, బౌద్ధ భిక్షువుల ఆసనాలు, లింగాల కొండ చుట్టూ కలియ తిరిగారు. కొండ వద్ద రంగులరాట్నాలు, జెయింట్ వీల్స్, గాలిపటాల పోటీలు, రంగురంగుల పంచదార చిలకలు, చిన్నారులను ఆకర్షించే వివిధ రకాల బొమ్మలు ఆకర్షించాయి.ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -మునగపాక: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు ఆధ్వర్యంలో తన తల్లి దిమ్మల అచ్చియమ్మ జ్ఞాపకార్థం సోదరుడు నూకరాజుతో కలిసి బుధవారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పారావు

పారిశుధ్య కార్మికులకు దుస్తులు



దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ విమల నాయుడు

ప్రజాశక్తి అచ్యుతాపురం : అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం గ్రామ సర్పంచ్ కె విమలనాయుడు సంక్రాంతి పండగ సందర్భంగా వస్త్రాలు, మిఠాయిలు అందజేశారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రపరచడంలో పారిశుధ్య కార్మికులు నిత్యం శక్తివంతం లేకుండా పనిచేస్తున్నారని, వారి సేవలు మరువ రానివన్నారు.

వైభవంగా మకరజ్యోతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : గౌరీ పంచాయతన దేవాలయంలో అయ్యప్పస్వామి మకర జ్యోతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాని శబరిమల ఆలయ నమూనాలో అయ్యప్పఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు సూర్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు కో కన్వీనర్ ఆధ్వర్యంలో మకర జ్యోతి ప్రజ్వలన, పడిపూజను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గౌరీ సేవా సంఘం మాజీ అధ్యక్షులు మళ్ల సాంబశివరావు, అనకాపల్లి వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) కుటుంబ సమేతంగా వచ్చి నిర్వహించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, అయ్యప్ప స్వామి దేవాలయ కన్వీనర్ మళ్ల సూర్యప్రకాశరావు, ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

సమైక్య స్ఫూర్తికి చిహ్నాలు తీర్థాలు



గాలిపటాల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి- అనకాపల్లి : గ్రామాలలో తీర్థాలు సాంప్రదాయాలు సమైక్యతకు స్ఫూర్తిగా నిలుస్తాయని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రాంకీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. శంకరం గ్రామం బొజ్జన్న కొండ వద్ద జరిగిన తీర్థం సందర్భంగా గాలి పటాల పోటీలను ప్రారంభించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పల్లె సాంప్రదాయాలకు, పండుగులకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా రంగుల రాట్నం ఎక్కి ప్రజలను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని ఉపమాక గ్రామంలో కనుమ సందర్భంగా బుధవారం తీర్థం జరిగింది. చిన్న చిన్న దుకాణాలు వెలసాయి. తీర్థంలో చిరువ్యాపారులు బొమ్మలు, ఆట వస్తువులు తదితర సామాగ్రి అమ్మకాలు చేపట్టారు. చుట్ట ప్రక్కల గ్రామాల నుంచి పెద్దలు, యువకులు, పిల్లలు అని తేడా లేకుండా జనం తరలివచ్చారు. తీర్థంలో సందడిచేసారు. పిల్లలు ఆట వస్తువులు కొనుగోలు చేసారు. కనుమ సందర్భంగా పెద్దలు, యువకులు, పిల్లలు కొత్తబట్టలు ధరించి ఎంతో ఉత్సాహంగా గడిపారు.యాదవులు తాడి పెద్దుల ప్రదర్శన చేసారు. పలువురు ఆశక్తిగా తిలకించారు. తీర్థం సందర్భంగా ఉపమాకలో జనం రద్దీ కనిపించింది.

యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెంలో బుధవారం రాజ రాజేశ్వరి తీర్థం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కర్రి జయలక్ష్మి, కర్రి జగన్నాధరావు, ఝాన్సీ (జనసేన), పొలమరశెట్టి బుజ్జిబాబు, హైస్కూలు ఎస్ఎంసి చైర్మన్ విశ్వేశ్వరరావు, పొలమరశెట్టి పైడి నాయుడు (పాలసంఘం), పిఎస్ఎన్ఆర్ యూత్, ఆర్గనైజర్ స్వామి, కొరుమిల్లి సత్యనారాయణ, డాక్టర్ కె.ఎం.జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారని ఉత్సవ కమిటీ తెలిపింది. నిర్వాహకుల్ని ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గెలుపొందిన గుర్రపు యజమానులకు ప్రైజ్ మనీ అందించి అభినందించారు.



నక్కపల్లి తీర్థంలో దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

నేడు రైవాడ, ఎన్‌జి నగరంలో తీర్థాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని రైవాడ గ్రామదేవత ఎరకాలమ్మ తల్లి తీర్థం, ఎన్. గజపతినగరం గ్రామదేవత నారితల్లమ్మ అమ్మవారి తీర్థం గురువారం జరగనుంది.

రైవాడలో తీర్థం సందర్భంగా విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మాజీ సర్పంచి చల్లా తాతయ్యలు ప్రారంభించారు. తీర్థం సందర్భంగా రైవాడ జలాశయ సందర్శనకు వచ్చేవారు బోటు షికారు చెయ్యొద్దని, ఈతకు దిగడం వంటి సాహసాలు చెయ్యొద్దని ఎస్ఐ టి.మల్లేశ్వరరావు సూచించారు. ఎన్. గజపతినగరం గ్రామదేవత నారితల్లమ్మ అమ్మవారి తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం తారువ గ్రామదేవత మర్లమాంబ అమ్మవారి తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి.



గోతులుగా ఉన్న రహదారి



శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత (ఫైల్ ఫోటో)

సంక్రాంతికి గుంతల రహిత రహదారి ఎక్కడ?

ప్రజాశక్తి -కోటవురట్ల:సంక్రాంతికి గుంతల రహిత రహదారులుగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటనలు ఎక్కడా అమలు కాలేదు. అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్లే రహదారికి రూ.24 కోట్లతో గతేడాది పనులు రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులుగా మారుస్తామని దార్లపూడిలో వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు కాని పనులు మొదలు పెట్టక పోవడంతో రహదారిపై వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారి అని ప్రచారం చేసిన ప్రభుత్వం తీరా చూస్తే ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయన్నారు. దీంతో ప్రభుత్వంపై వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



విజేతలకు బహుమతి ఇస్తున్న ఎంపీ రమేష్

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాయకరావుపేట ఉప తహసిల్దార్ ఆనంద్ ఆధ్వర్యంలో గడిచిన 10 రోజులుగా జరుగుతున్న ఆర్‌పి ఎల్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. ఉత్కంఠ భరితంగా కొనసాగిన పోటీల్లో పలు గ్రామాలకు చెందిన టీముల మధ్య రసవత్తర పోటీ కొనసాగింది. ఈ పోటీలలో సత్యాడ కింగ్స్ విన్నర్స్‌గా నిలవడంతో రూ.35000, రనర్స్ గంట్యాడ గ్లాడియేటర్ జుట్టుకు 25 వేలు నగదు బహుమతిని మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ సూర్యారావు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని సంక్రాంతి సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.రాజయ్యపేట, బృందావనం కాలనీలో ముగ్గుల ఫోటీలు నిర్వహించారు. ప్రథమ విజేత చొక్కా మోక్ష విధాత్రికు 5 తులాల వెండి, ద్వితీయ విజేత కారే శిరీషకు కంచు బింది, తృతీయ విజేత బొంది సత్యవతికు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

చందనాడ గ్రామంలో వాసవి క్లబ్, పుణ్యమంతుల రమణ, కర్రి బాబ్జి, పలువురు గ్రామ ప్రజల సహాయ, సహకారాలతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గునుపూడిలో నిర్వహించిన ముగ్గులు పోటీల్లో విజేతలకు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ బహుమతులు అందజేశారు.

దేవరాపల్లి: మండల కేంద్రంలో మాజీ ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కళా ప్రదర్శనలు జరిగాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు రైతు చిహ్నం నాగళ్లను కిలపర్తి కుటుంబ సభ్యులు బహుకరించారు. సీఎం రమేష్ సోదరులు సురేష్ నాయుడు, రిత్వి, బండారు తనయుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలో లక్ష్మీపురం గ్రామంలో ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలను ఎంపీ సీఎం రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎంఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లునాయుడు, ఈర్లే శ్రీరామమూర్తి, గేదెల సత్యనారాయణ, బొడ్డేడ నాగ గంగాధర్,కనిశెట్టి సన్యాసిరావు, భూతనాథ నాని కుమార్, సిరిసిల్ల సత్య రావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: సంక్రాంతి సందర్భంగా ఉగ్గినవలస, దాలివలస, చౌడువాడ పాతవలస తదితర గ్రామాల్లో ఫ్లడ్ లైట్స్ వెలుగులో క్రికెట్ వాలీబాల్ కబడ్డీ పోటీలు నిర్వహించారు బాల బాలికలకు మ్యూజికల్ చైర్, స్లోసైకిల్, డాన్స్, జానపద గేయాలాపన పోటీలు నిర్వహించారు. కె.కోటపాడులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

సబ్బవరం: మండలంలోని అసకపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా పిఎసిఎస్ మాజీ వైస్‌చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు 72 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలతోపాటు పాల్గొన్నవారందరికీ బహుమతులు అందజేశారు మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ,ఎంపిటిసి కర్రి అప్పారావు, ఉప సర్పంచ్ కరణం సురేష్ బాబు, కరణం సూరిబాబు, కరణం రమణ, కర్రి నాయుడు, ఎం. కన్నయ్య, టి. శ్రీను, రాము, ఎం. నాయుడు, డి. నారాయణరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్లో బైక్, చదరంగం పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దలు ఎస్ శివబాబునాయుడు, ఉపసర్పంచ్ భీశెట్టి రాము బహుమతులు అందజేశారు. ఆడారి కనుక అప్పలనాయుడు, మల్ల చినబాబు, ఎస్ పైడిరాజు, వై గోవిందు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామంలో ముగ్గుల పోటీల విజేతలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బత్తుల తాతయ్య బాబు బహుమతులను అందజేశారు. అచ్చమ్మ పేరంటాలు తీర్థం సందర్భంగా ఎడ్ల పందెం, కుండల పోటీలు నిర్వహించారు.

బుచ్చయ్యపేట :కనుమ సందర్భంగా రైతులు తమ పశుసంపదకు పూజలు నిర్వహించారు. తిను బండారాలను పళ్ళను పశువులకు పెట్టి పూజలు చేశారు

అనకాపల్లి : శ్రీరాంనగర్ కాలనీలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, జీవీఎంసీ కార్మికుల సహకారంతో పెద్దలకు షటిల్, గ్లాస్ బాల్, ముగ్గుల పోటీలు, పిల్లలకు మ్యూజికల్ చైర్, గ్లాస్ బాల్, కప్పులో బూరలతో నడక పోటీలు, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ బి. ఉమామహేశ్వరరావు, సభ్యులు ఏ వాణిశ్రీ, జి. సుభాషిని జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గంటా శ్రీరామ్, యర్రంశెట్టి శివకూమార్, యర్రంశెట్టి ఏసు రాజు, శ్రీను పాల్గొన్నారు.

అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా పార్లమెంట్ రైల్వే స్టాండింగ్ చైర్మన్, స్థానిక ఎంపీ సీఎం రమేష్ క్రికెట్ కప్ టోర్నీ విజేతగా తుమ్మపాల జట్టు నిలిచింది. విజేతలకు రూ.లక్ష నగదు బహుమతిని అందజేశారు.

సబ్బవరం. : మండలంలోని అంతకాపల్లి పంచాయితీ శివారు రావులమ్మ పాలెం గ్రామంలో లక్ష్మి ఎంటర్ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఒమ్మివానిపాలెం టీం విజేతగా నిలివగా, 20వేల నగదు, టోర్నమెంట్ కప్‌ను అందజేశారు. రన్నరప్ అంతకాపల్లి జట్టుకు రూ.15వేలు అందజేశారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పిఎసిఎస్ కార్యదర్శి గొంప రమణ, పల్ల రమణ,శ్రీరామ్ రెడ్డి రామకష్ణ, చీపురుపల్లి నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : మరుగున పడుతున్న భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలనే లక్ష్యంతో అమరజీవి పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం పేరాట్ల నరసింహమూర్తి పదేళ్లుగా చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం ఆలయ చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు కళ్యాణమండపం వద్ద సంక్రాంతి రోజున సాంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంద్రేగుల దుర్గాప్రసాద్, యలమంచిలి బంగార్రాజు, సూరే సుబ్బారావు, సూరే సతీష్ పాల్గొన్నారు.

అనకాపల్లి :సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు, హ్యూమన్ రైట్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో సంక్రాంతి ఫోర్ బౌండరీ కప్ గవరపాలెం చిన్న హైస్కూల్లో ఘనంగా జరిగాయి.మాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డులను కాంద్రేగుల శ్రీరామ్ విన్నర్ కప్ షీల్డ్‌ను అరవింద్ టీంకు జగన్నాథ స్వామి మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు అందజేశారు. ఆర్గనైజర్లుగా ఆడారి సతీష్, కొణతాల శ్రీను వ్యవహరించారు.

పద్మనాభం: మండలంలోని వికె. పాలెం, మద్ది, పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో ఉద్యోగులు, గ్రామస్తుల సహకారంతో యువత సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వికె.పాలెంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. మద్దిలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

ఆనందపురం :మండలంలో తర్లువాడలో పండుగ సందర్భంగా క్రికెట్, ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహించారు. విశాఖ జిల్లా జనసేన రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, టిడిపి నాయకులు తాట్రాజు అప్పారావు, బంకు రాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : వాడ వాడలా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాగర తీరాన పిల్లలు, పెద్దలు, మహిళలు గాలిపటాలు ఎగుర వేశారు. ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.



నక్కపల్లిలో బహుమతి ఇస్తున్న నాయకులు, గ్రామ పెద్దలు

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ (కెఇఎ) ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో పాటు ఎలక్ట్రిషియన్, వాటర్ సప్లై, సిబ్బంది,గ్రామ రెవెన్యూ తలయారులు సంబంధిత కార్మిక సిబ్బందికి నిత్యావరస సరుకులు ఉచితంగా పంపిణి చేశారు. ఈ సందర్భం గా సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతు న్నందుకు కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియే షన్ సభ్యులను అభినందించారు. వీరి అభ్యర్థన మేరకు గ్రామంలో యువత కు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు భవనాన్ని నిర్మించడానికి అవసరమైన స్థలాన్ని కోరిన నేపథ్యంలో పంచాయతీ తరపున కేటాయిస్తామన్నారు. కొత్తకోట ఎంప్లాయిస్ అసోసి యేషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి ఏటా కూడా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి అందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించు కుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ వ్యవస్థాప కులు గర్రెడ్డి రాంబాబు, గౌరవ అధ్యక్షులు నిరంజన్, అధ్యక్షులు పైల సత్యనారా యణ, ఉపాధ్యక్షులు వీర ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుమ్ముడు వాసు, కన్వీనర్ కేదార్శెట్టి గుప్తాజి తదితరులు పాల్గొన్నారు.



సరుకులు ఇస్తున్న నాయకులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అన్నవరం గ్రామంలో వరహానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై రమేష్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అన్నవరం సరిహద్దు ప్రాంతంలో సుమారు 45 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.



షాపుల వద్ద జనం

మార్కెట్లు కళకళ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలో మార్కెట్లన్నీ కళకళలాడాయి. పండుగ వేళ అన్ని రకాల షాపులలో కూడా వ్యాపారాలు జోరుగా సాగాయి. షాపింగ్ మాల్స్‌తో పాటు వస్త్రదుకాణాలు, రెడీమేడ్ షాపులు, ఫ్యాషన్ దుకాణాలు అన్నీ కూడా రద్దీగా మారాయి. వ్యాపార సముదాయాలతో పాటు మార్కెట్లకు సంక్రాంతి శోభ వచ్చింది. పూలదండలు, పువ్వులు, చెరుకు గడలు, కిరాణా సామాగ్రి , ఫ్యాన్సీ సామాన్లు విపరీతంగా కొంటున్నారు రోడ్లన్నీ కూడా రద్దీగా మారిపోయాయి. ఒక్క సారిగా ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. నర్సీపట్నంలో కొన్ని సంవత్సరాలుగా మకర జ్యోతి మహొత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో స్థానిక అయ్యప్ప దేవాలయం వద్ద విద్యుత్ అలంకరణతో పాటు కొన్ని సాంస్కతి కార్యక్రమాలను ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేశారు.



చికెన్ షాపు వద్ద వినియోగదారులు

మాంసం దుకాణాలు కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని కనుమ సందర్భంగా బుధవారం మాంసం దుకాణాలు జనం రద్దీతో కిటకిటలాడాయి. మాంసం దుకాణాలు వద్ద మాంసం కోసం జనం క్యూ కట్టారు. బ్రాయిలర్ మాంసం స్కిన్ లెస్ కిలో రూ. 250లు చొప్పున వ్యాపారులు విక్రయిం చారు. జనం ఎగబడి మాంసాన్ని కొనుగోలు చేశారు. సంక్రాంతి సందర్భంగా మద్యం షాపులు వద్ద జనం బారులు తీరారు.

బల్క్ డ్రగ్ పార్క్ వస్తే ఉండలేం

-బోయపాడు గ్రామాన్ని తరలించండి-హోం మంత్రి అనితకు మత్స్యకారుల వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట పంచాయితీ బోయపాడు గ్రామాన్ని పూర్తిగా తొలగించి, తమకు అనుకూలమైన ప్రాంతంలో పునరావాసం కల్పించాలని ఆ గ్రామానికి చెందిన మత్స్యకారులు హెూంమంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రం అందజేసారు. నక్కపల్లిలో బుధవారం ఆమె స్వగృహం నందు మత్స్యకారులు కలిసి, తమ సమస్యలను వినిపించి, తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల జీవన ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందన్నారు. కంపెనీ ఏర్పాటు చేయడంతో గ్రామంలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని, కొన్నాళ్లకు తమకు తామే పారిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ పార్కు కోసం నిర్మాణం చేపడుతున్న రోడ్లు తామంతా సముద్రంలో వేటకు ఉపయోగించే రోడ్డుకు అడ్డంగా నిర్మాణం చేపడుతున్నారు అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు 10 సంవత్సరాలు నుండి గ్రామం తొలగిస్తామని చెప్పి, గ్రామంలో అభివృద్ధి పనులు నిలుపుదల చేశారని, కనీసం డ్రైనేజీ కూడా నిర్మించలేదన్నారు. బోయపాడు గ్రామంలోగ్రామ కంఠం 269/2 లో 4.5 సెంట్లు, 270/1 ఏ లో 2.5 సెంట్లు, 270/5 లో 0.81 సెంట్లు, 274 లో 6 ఎకరాలు మొత్తం తొలగించాలని, 2024కి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి 15 లక్షల రూపాయలు చెల్లించాలని, మత్స్య కారులకు పునరావసం సముద్రతీరం వద్ద కల్పించాలన్నారు. ఇప్పటికే మంజూరైన జెట్టీని వెంటనే నిర్మాణం చేపట్టాలని, ఇళ్ళ నిర్మాణం కోసం ప్రభుత్వ స్కీమ్ వర్తింపజేయాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి రీవెరిఫికేషన్ చేసి అర్హులకు మాత్రమే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పునరావాసం కల్పించిన తర్వాతే పరిశ్రమకు సంబంధించిన పనులు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని వెల్లడించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ప్రెసిడెంటు పిక్కి కొండలరావు, ఏపీ జె ఎ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిపిల్లి నూకరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ సిరిపిల్లి అప్పలరాజు, పిక్కి చినతాత, కోడ సింహాచలం, కోడ శివ, మల్లె అప్పారావు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణను ఖండిస్తూ..

కొనసాగిన నిరసన దీక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార: పోర్టు ఉద్యోగులకు పండగ లేకుండా చేసిన మోడీకి పండగ లేకుండా చేస్తామని సిఐటియు పోర్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ తెలిపారు. బుధవారం కనుమ రోజున పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, పోర్టు హాస్పిటల్ వద్ద 107వ రోజు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకోవాలని, తురిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందన్నారు. సుమారు 40 వేల మంది కార్మికులకు వైద్య సేవలను అందిస్తున్న ఆసుపత్రిని ప్రైవేట్ వారికి అప్పగించడం అన్యాయమన్నారు.విశాఖ అభివృద్ధికి పోర్టు కీలకమని, ప్రతీ ఏటా మున్సిపాలిటీకి సగటున 65 కోట్ల పన్నులు కడుతున్న పోర్టును ప్రైవేట్‌కు ఇచ్చి ధారాదాత్తం చేయడం సరికాదన్నారు. పూర్తిగా టెండర్లు రద్దు చేయాలని, ఈ వాయిదాలు వేయడం కూడా కార్మిక వర్గ పోరాట ఫలితమని తెలిపారు. ప్రైవేటీకరణ చేపడితే కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పోర్టు యూనియన్ అధ్యక్షుడు జె.సత్యనారయణ, కె.ఎస్ కుమార్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు పనులను పర్యవేక్షిస్తున్న చింతకాయల విజయ్

ముమ్మరంగా కల్వర్టు పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారి శివపురంలో కల్వర్టు శిథిలమవడంతో వాహనదారులు అవస్థలు పడేవారు. ఐదు సంవత్సరాలుగా ఈ కల్వర్టు పూర్తిగా శిథిలమై పోయింది. గత ప్రభుత్వ నాయకులు దృష్టికి తీసుకెళ్లినప్పుడు తాత్కాలిక పనులు చేపట్టారు. దీంతో, ఎన్నికల ముందు అయ్యన్న తనయుడు విజయ్ ఇచ్చిన మాట ప్రకారం ఈ కల్వర్టు పనులు చేపట్టడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుఫానులు కారణంగా రహదారి పై ఉన్న కల్వర్టుకు రంధ్రం పడింది. దీంతో వర్షపు నీరు రోడ్డుపైకి చేరి వాహనదారులు గోతులలో పడుతుండేవారు. 2023 డిసెంబర్ 6న వచ్చిన తుఫాను తాకిడికి పెద్ద చెరువులో చేరాల్సిన నీరు కల్వర్టు దెబ్బతినడంతో ఈ ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయేది. గతంలో ఈ సమస్యపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ నిరసన తెలియజేశారు. ఈ కల్వర్టు పనులకు స్పీకర్ అయ్యన్న 55 లక్షల రూపాయలను మంజూరు చేయించారు.

ఉపమాకలో వైభవంగా కనుమ వేడుకలు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న రాజాధిరాజ అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. కన్నుల పండువుగా కనుమ పండుగ సాగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కనుమ పండుగ పురస్కరించుకొని వెంకన్నకు రాజాధిరాజా అలంకరణ చేసారు. సాయంత్రం గరుడాద్రి పర్వతం చుట్టూ పుణ్యకోటి వాహనంపై వెంకన్న రాజాధిరాజా అలంకరణతో వైభవంగా గిరిప్రదక్షణోత్సవాన్ని నిర్వహించారు. సుదూరు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గిరిప్రదక్షణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అరటి గెలలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బంధుర సరస్సు వద్ద మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసారు. అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. ఉపమాక గ్రామానికి చెందిన మీగడ వారి కుటుంబీకులు, ఈశ్వరరావు ఆధ్వర్యంలో కన్నుల పండువుగా కనుమ వేడుక జరిగింది. వెంకన్న ఆలయ ప్రాంతం భక్తుల రద్దీతో జనసంద్రంగా దర్శనమిచ్చింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వెంకన్నను ఊరేగిస్తున్న భక్తులు



ఉత్సవాల్లో స్పీకర్ అయ్యన్న దంపతులు

ఘనంగా మకర జ్యోతి ఉత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మకర జ్యోతి మహెూత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి స్వామివారి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అవతార్ మెహర్ బాబా సంకీర్తనలు, సత్యసాయి కీర్తనలు భక్తిశ్రద్ధలతో ఆలపించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామివారి రథయాత్ర శోభాయ మానంగా తీర్చిదిద్దారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, సతీమణి చింతకాయల పద్మావతి, రాజేష్, సువర్ణ, దివ్యశ్రీలు వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత వెంకటరమణ, సినిమా, టీవీ ఆర్టిస్ట్ ఆర్ గిరిశంకర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సాయి మాస్టారు, స్కేటింగ్ ఛాంపియన్ చైత్ర దీపిక, ఈటీవీ మాటీవీ ఫేమ్ సింగర్ ధీరజ్, రోలర్ స్కేటింగ్ నేషనల్ మెడలిస్ట్ శంకర్‌లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఘనంగా సన్మానించారు.

పర్యాటకుల సందడి

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. మునుపెన్నడు లేనివిధంగా పర్యాటకుల తాకిడి పెరిగింది. అరకు ప్రాంతంలోని పర్యాటక సందర్శిత పద్మావతి ఉద్యానవన కేంద్రం, గిరిజన మ్యూజియం కిటకిట లడాయి. చాక్లెట్ ఫ్యాక్టరీ కిటకిటలాడుతున్నాయి.

వణుకుతున్న మన్యం

-పొగ మంచుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
-9 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు



రోడ్డుపై కురుస్తున్న పొగ మంచు

ప్రజాశక్తి-పాడేరు: మన్యాన్ని చలి పులి వణికిస్తోంది. ఏజెన్సీ అంతటా ఉష్ణోగ్రత పది డిగ్రీలకు పడి పోయింది. రేయింబగళ్ళు దట్టంగా పొగ మంచు కురుస్తోంది. దీంతో, చలి మరింత అధికమవుతోంది. చలి తీవ్రతతో మన్య ప్రజలు గజగజ వణుకుతున్నారు. వేకువ జాము, ఉదయం పూట, రాత్రి వేళల్లో బయట ప్రదేశాల్లో పనులు నిర్వర్తించుకునే ప్రజలు పొగ మంచు తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఘాట్ ప్రయాణాల్లో వాహన చోదకులు పొగ మంచుతో రోడ్డు కానరాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పగటిపూట కూడా వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. మధ్యాహ్నం బారెడు పొతే వరకు ఎండా కానరాలేదు. మన్యం ప్రజలు మిట్ట మధ్యాహ్నంకి గాని ఎండను చూడలేని పరిస్థితి ఉంది.

మన్యవాసులు చలి తీవ్రతతో ఉన్నివస్త్రాలు ధరించి.. నెగళ్లు వేసుకుని చలి మంటలతో ఉపశమనం పొందుతూ జీవనం సాగిస్తున్నారు.

చలి వాతావరణంతో వచ్చే వ్యాధుల మూలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆస్తమా ఇతర శ్వాసకోస వ్యాధులు ఉన్న రోగులకు ఈ చలి వల్ల ఇక్కట్లు తప్పడం లేదు. వాతావరణంలో జీవనం సాగించడం ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోందని వైద్యుల సూచన మేరకు రోగగ్రస్తులు మైదాన ప్రాంతాలకు తరలి వెళ్లే పరిస్థితి పలువురు ఎదుర్కొంటున్నారు. ఉత్తరాంధ్రలో అతి శీతల ప్రాంతంగా ఉన్న పాడేరు, అరకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్ని వస్త్రాలకు మంచి గిరాకీ ఉంది. ఈ సీజన్లో అక్టోబర్ నుంచి జనవరి వరకు సుమారు నాలుగు నెలల పాటు ఉన్ని వస్త్రాల వ్యాపారం భారీగా సాగుతోంది.రూ.300 నుంచి 3 వేల వరకు రగ్గులు స్వెటర్లు లభిస్తున్నాయి.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర

ప్రజాశక్తి -అరకులోయరూరల్: అరకులోయ మండలం బస్కి పంచాయితీ గిర్లిగూడ నుండి డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయితీ పరిశీల గ్రామం వరకు సుమారు నాలుగున్నర కిలోమీటర్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, దేవరపల్లి క్లస్టర్ పీసా కార్యదర్శి స్వాబి పొత్తి డిమాండ్ చేశారు. బుదవారం గిర్లిగూడ నుండి పరిశీల వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు వరకు సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు పాదయాత్ర చేపట్టారు. ఈ సంధర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, దేవరపల్లి క్లస్టర్ పీసా కార్యదర్శి స్వాబి పొత్తి మాట్లాడుతూ, గర్లిగూడ గుడ నుండి పరిశీల వరకు రోడ్డు సమస్య తీవ్రంగా ఉందని, దీంతో నిత్యం రాకపోకలు సాగించే గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డుంబ్రిగూడ మండలం కితలంగి పంచాయతీ పరిశీల గ్రామం దగ్గర బ్రిడ్జి లేక అరకువేలి, అనంతగిరి, హుకుంపేట మండలానికి చెందిన గిరిజనులు పండించిన సరుకులు అమ్మకానికి మార్కెట్‌లో తీసుకు రావాలంటే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే అంబులెన్స్ కుడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కిల్లో క్రిష్ణ, శోభ బలరాం, కిల్లో గోవర్ధన్, కిల్లో బాలరాజు, వంతల హరి పాల్గొన్నారు.



పాదయాత్ర చేపడుతున్న గిరిజనులు, నాయకులు